క్లుప్తంగా

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరసిహనాయక్

గొల్లప్రోలు: చేబ్రోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిఎచ్‌సీ)ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు ఎక్కువ శాతం డెలివరీ జరిగేలా చూడాలని ఆదేశించారు. నెలకు మూడు డెలివరీలు జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారుకు తెలియజేశారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు తనిఖీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

విద్యార్థుల కిట్లలోని బూట్లను పరిశీలించిన సీఎంఓ



సామర్లకోటలో బూట్లను పరిశీలించిన సీఎంఓ

సామర్లకోట: మండల పరిధిలోని విద్యార్థులకు వచ్చిన కిట్లను మంగళవారం సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, కిట్లు, నోట్ పుస్తకాలు భద్రపరచిన పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు వచ్చిన నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాల వివరాలను మండల విద్యాశాఖాధికారి పి.పుల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వచ్చిన బూట్ల సైజులు పరిశీలించే విధంగా విద్యార్థులను హాజరు పరిచి కొలతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో సీఆర్పీలు, పార్టు టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన



సామర్లకోట ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించిన అధికారులు

సామర్లకోట: స్థానిక ఫిల్టర్ బెడ్ ప్లాంటును పబ్లిక్ హెల్త్ అధికారులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఫిల్టర్ చెరువులో నీటిని, ఫిల్టర్ బెడ్ ప్లాంటుతో తాగునీరు శుద్ధి అవుతున్న విధానాన్ని ఎస్‌ఈ సుధాకర్, డీఈ హుస్సేన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిల్టర్ బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఏడీబీ రోడ్డులోని ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో ఉన్న టైల్స్ ఫ్యాక్టరీలో తొలగించిన కార్మికులను విధులలోనికి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫ్యాక్టరీ గేటు వద్ద ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను తొలగించి కార్మికుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను తుంగలోనికి తొక్కారని ఆరోపించారు. 16 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను తొలగించడం దారుణమని అన్నారు. ఈ ఆందోళనలో చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు,గంగాధర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ రాజీనామా

పిఠాపురం: స్థానిక అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామాలను సహకార సంఘాల డిప్యూటీ రిజిస్టార్‌కు పంపించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు బొజ్జా మాణిక్యాలరావు, గరగ మహేశ్వరరావు, దుళ్ల అయ్యన్న తమ పదవులకు రాజీనామాలు చేసిన సందర్భంగా మాట్లాడుతు తమపై నమ్మకం ఉంచి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తమకు పదవులు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని అప్పుల్లో కూరుకుపోయిన సొసైటీని లాభాల్లోకి తీసుకు వచ్చామన్నారు. ప్రభుత్వ మారినందున నైతక బాధ్యతగా తాము పదవులకు రాజీనామాలు చేసినట్టు వారు తెలిపారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- ఆఫర్లతో రైతులకు ఎర వేస్తున్న కంపెనీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనాలని సూచన
- మండలంలో 10,154 ఎకరాల్లో సాగు
- సుమారు 6,150 మంది రైతులు



వాకతిప్పలో ఎరువులు, పురుగుమందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వర్షం కురిసిన వెంటనే నారుమడికి దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటున్నారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీల విత్తనాలు, పురుగు మందుల ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో నాణ్యమైన విత్తనాల కోసం రైతులు ఆరా తీస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కాగా రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్‌డ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ముఖ్యంగా రైతులే తమ సొంతంగా విత్తనాలను తయారు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

డీలర్లకు బోలెడు ఆఫర్లు

పలు కంపెనీల యాజమన్యాలు జిల్లాలోని డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ టూర్లు, ఆఫర్ చేస్తుండడంతో వారు రైతులకు ఎక్కువ మోతాదులో సదురు కంపెనీల విత్తనాలను కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ, నాసి రకం విత్తనాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. రైతులు ఈ కంపెనీల వలలో పడి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడం ఆ తర్వాత మోసపోవడం షరామామూలైంది. మండలంలో మొత్తం సుమరు 6150 వేలకు పైగా రైతులు సుమరు 10,154 ఎకరాల్లో ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

మోతాదుకు మించితే నష్టాలే

రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశ్యంతో విత్తనాలతో పాటు ఎరువులు మోతాదుకు మించి వినియోగిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. పురుగు మందుల విషయంలోనూ మోతాదుకు మించి వినియోగించవద్దని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమి పోషకాల విలువల ఆదారంగా ఎరువులు, పురుగు మందులు వేయడం ఉత్తమమని సూచిస్తున్నారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించి సాగు చేయాలని పేర్కొంటున్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే రైతులు ఫిర్యాదు చేయాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే రైతుల విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదును తప్పకుండా తీసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన ఖాళీ సంచులను కూడా ఉంచాలి. రైతులకు పంట బీమా రావాలంటే విత్తనాలు కొనుగోలు చేసిన రశీదు తప్పనిసరిగా ఉండాలి. ఫెర్టిలైజర్ షాపుల్లో డీలర్లు ఎరువులు, విత్తనాల వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలి. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. ముఖ్యగా కొనుగోలు చేసిన విత్తనాలలో 100గింజలు తీసుకుని మొలక శాతాన్ని పరిక్షించుకోవాలన్నారు. సుమారు 80 శాతం పైగా మొలకెత్తిన విత్తనాలను మాత్రమే ఉపయోగించుకోవాలి. విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు స్వర్ణ రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

–వి.జోగిరాజు,
మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

వేధిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయాలి



మూలపేట రోడ్డులో బైఠాయించి ఆందోళన చేస్తున్న అమరవల్లి గ్రామస్తులు

కొత్తపల్లి: అప్పు తీర్చమని వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేయాలని అమరవల్లి గ్రామస్తులు మంగళవారం ఉప్పాడ–కొనపాపపేట బీచ్ రోడ్డులో మూలపేట వద్ద ఆందోళన చేశారు. అమరవల్లి గ్రామానికి చెందిన బోరా కనకదుర్గ(38) అదే గ్రామానికి చెందిన బోరా చిన రమణారెడ్డికి ఉన్న సొమ్ము లావాదేవీలతో ఆమెను తరచూ వేధించే వాడని, అతని వేధింపులు తట్టుకోలేక గత నెల 21న కనకదుర్గా రామన్న పాలెం ఉప్పుటేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కనకదుర్గా ఆత్మహత్యకు బోరా చినరమణారెడ్డి కరణమని పోలీసుకు ఫిర్యాదు చేసి రోజులైనప్పటికి నిందుతుడిని అరెస్టు చేయలేదని గ్రామస్తులు చేబుతున్నారు. రమణారెడ్డిని తక్షణం అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అప్పటి వరకూ ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించారు. సుమారు గంట పాటు వాహనల రాకపోకలు నిలిసిపోయాయి. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆందోళనకారులతో చర్చించారు. రమణిరెడ్డిని అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రిలయన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ మేనేజర్ నాగేశ్వరరావు

పెద్దాపురం: గ్రామీణ రైతులకు రిలయన్స్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జిల్లా మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళారం వీఏఏ సీహెచ్ విజయదుర్గ అధ్యక్షతన విత్తన ఉత్పత్తి, విత్తన శుద్ధి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి 150 మంది రైతులకు డిజిటల్ ఫామ్ స్కూల్ ఏర్పాటు చేసి వారికి ప్రతీ రోజు వాతావరణ పరిస్థితులు, పంటలో వచ్చే చీడపీడల గురించి ప్రతీ రోజు వాయిస్, వాట్సాప్ మెస్సెజ్ ద్వారా సమాచారం అందిస్తున్నట్టు తెలిపారు. రైతులకు ఎటువంటి సమాచారం కావల్సినా రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004198800కి ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు సమాచారం తెలుసుకోవచ్చన్నారు. వీఏఏ విజయదుర్గ మాట్లాడుతూ విత్తన శుద్ధికి సంబంధించి కేజీ విత్తనానికి 8 గ్రాములు సుడోమోనస్ కలిపి 24 గంటలు ఉంచి తరువాత పొలంలో వెదజల్లుకోవచ్చన్నారు. అనంతరం రైతలకు విత్తనశుద్ధి, విత్తనోత్పత్తిపై కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అమృత, రైతులు ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, మేడిద శ్రీనివాస్, అడపా సుబ్రహ్మణ్యం, గంగాధర తదితర రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంకండి

- దోమల వృద్ధితోనే జ్వరాల వ్యాప్తి
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



నాగులపల్లి సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వర్షా కాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. కొత్తపల్లి మండలంలో సీజనల్ జ్వరాలు మొదలయ్యాయి. డెంగీ, మలేరియా జ్వరాలు దోమల ద్వారా ఒకరి నుంచి మరోకరికి వ్యాప్తి చెందుతాయి. ఈ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు నిల్వ నీటిలో, వర్షపు నీటీ పెరుగుతాయి. వీటి వృద్ధిని నియంత్రించాలంటే గృహాల వద్ద చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు దోమల వృద్ధిని అరికట్టవచ్చు. తద్వారా జ్వరాలకు చెక్ పెట్టవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌసన్య సూచించారు. మండలంలోని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

దోమల నియంత్రణ ఇలా..

- ఆడ ఎనాఫిలస్‌దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం, ఈడిస్ దోమలు కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయి.
- ఎనాఫిలస్, ఈడిస్ రెండు రకాల దోమలు నిల్వ ఉన్న నీటిలో, వర్షపు నీటిలో పెరుగుతాయి.
- నీటి నిల్వ చేసిన గోళాలు, డ్రమ్ములు, వాటర్ ట్యాంకులు, సంపులు, ఫ్లవర్ వేజ్‌లు, రుబ్బు రోళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్సు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీకప్పులు, ఐస్‌క్రీం కప్పులు ఇలా నీరు నిల్వ ఉండే దేనిలోనైనా దోమలు పెరుగుతాయి.
- నిల్వ ఉన్న నీటిపై దోమలు వాలి గుడ్లు పెడతాయి, ఒక దోమ 200 వరకూ గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లన్నీ వారం నుంచి 10 రోజుల్లో దోమలుగా వృద్ధి చెందుతాయి.
- డెంగీ వైరస్ ఇన్‌ఫెక్ట్ అయిన దోమ పెట్టే గుడ్లు అన్నీ వైరస్ సోకిన దోమలుగా వృద్ధిచెందుతాయి.
- దోమల పెరుగుదలను నియంత్రించాలంటే వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలి.
- నీటి నిల్వలను పారబోసి మళ్లీ ఫ్రెష్‌గా నీటిని పట్టుకోవాలి.
- నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, ట్యాంకులపై దోమలు చొరబడకుండా మూతాలుగాని, గుడ్డగాని చుట్టాలి.



సౌజన్య

సర్కారీ బడిలో నో సీట్స్..

- ప్రభుత్వ పాఠశాలలకు పెరిగిన డిమాండ్
- పెరిగిన మౌలిక వసతులతో మారిన పరిస్థితి
- ఫలితాలిస్తున్న ఉపాధ్యాయుల స్పెషల్ డ్రైవ్



సామర్లకోట బచ్చుఫౌండేషన్ పాఠశాలలో హెచ్ఎం సాయిరామకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఏడో తరగతిలో చేరుతున్న విద్యార్థి



విద్యార్థుల సంఖ్య పెంపులో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో వారి వారి పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. దాంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు డిమాండ్ పెరుగుతోంది. ఒకటి నుంచి ఐదు వరకు ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలు, వివిధ కాన్వెంట్లలో చదివిన పిల్లలు హైస్కూళ్లలో ఆరు, ఏడు, 8వ తరగతుల్లో చేరడానికి వస్తున్నారు. హైస్కూళ్లలో ఆరో తరగతి నుంచి ఏడో తరగతికి విద్యార్థులు వెళ్లడంతో ఆరో తరగతిలో విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ఆరో తరగతిలో చేర్పడానికి తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. అయితే వివిధ కాన్వెంట్ల నుంచి ఏడు, 8వ తరగతులలో చేరడానికి విద్యార్థులు రావడంతో సీట్ల కొరత ఏర్పడు తోంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలతో పాటు నాలుగు మున్సిపల్ హైస్కూళ్ల (బచ్చు ఫౌండేషన్, యార్లగడ్డ అక్కిరాజు, బీబీఆర్, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూళ్లు) ఉన్నాయి. వీటిలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, అయోధ్యరామపురంలోని బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్స్‌లో విద్యార్థులు చేరడానికి మక్కువ చూపుతున్నారు. ఆటల్లో మక్కువ ఉన్న వారు సైతం ప్రభుత్వ హైస్కూల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో విశాలమైన ఆట స్థలం ఉండడంతో అక్కడ చేరేందుకు ఇష్టపడుతున్నారు. బాలికలు ఉన్న పాఠశాలలోనే తమ ఆడ బిడ్డలను చదివించుకోవాలనుకొనే వారు బ్రౌన్ పేటలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో తమ పిల్లలను చేరుస్తున్నారు. అయితే ఇప్పటికే అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఉపాధ్యాయులను నియమించావలసి ఉందని ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలియజేస్తున్నారు.

- విద్యా సంవత్సం ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన ప్రారంభం అవుతుంది. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా జూన్ 13 నుంచి పాఠశాలను తెరవాలని నిర్ణయించారు.
- పాఠశాలలు తెరిచే నాటికే ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, యూనిఫారం, బ్యాగ్‌లు అందజేయాల్సి ఉంది. అయితే బ్యాగ్‌లు జగనన్న పేరుతో తయారు కావడంతో వాటిని చెరిపేసే ప్రయత్నాలు జరగడంతో బ్యాగ్‌లు రావడం ఆలస్యం అవుతుందని మండల విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. బ్యాగ్‌లతో పాటు యూనిఫారం, డిక్షనరీలు, బెల్టులు రావలసి ఉన్నదని తెలిపారు. 60,903 నోట్ పుస్తకాలు, షూలు బాలికలకు 4,134, బాలురకు 3,957 వచ్చాయని చెప్పారు. అదే విధంగా పాఠ్యాపుస్తకాలు వచ్చాయన్నారు.

వేళంగి ప్రీమియర్ లీగ్ విజేత పెదకొత్తూరు

రన్నర్స్‌గా వేళంగి మార్కెట్ సెంటర్



విజేతజట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డాక్టర్ వెంకన్నారావు తదితరులు

కరప: మండలం వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేళంగి క్రికెట్ క్లబ్ (వీకేసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేళంగి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. వేళంగి పరిసర గ్రామాల నుంచి ఆరు జట్లు వేళంగి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో తలపడగా పెదకొత్తూరు, వేళంగి మార్కెట్ సెంటర్ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరిగింది. ఇందులో పెదకొత్తూరు జట్టు విజేతగా, వేళంగి మార్కెట్ సెంటర్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేత జట్టుకు ట్రోఫీ, రూ.10 వేలు నగదు, రన్నర్స్‌జట్టుకు ట్రోఫీ, రూ 5 వేలు నగదును వీకేసీ తరపున లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, కాకినాడ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు, చుండ్రు వెంకన్నారావు, గరగ జెమ్మీలు అందజేశారు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, శాకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో బయోమెథనేషన్ ప్లాంట్

- పనులు వేగవంతం చేయండి
- కమిషనర్ వెంకటరావు ఆదేశం



బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: తడి చెత్త నుంచి సీఎన్‌జీ గ్యాస్‌ను ఉత్పత్తి చేసే బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం కానుందని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చొల్లంగి గ్రామంలో 6.45 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్ నిర్మాణమవుతుందన్నారు. తడి చెత్త నుంచి సీఎన్‌జీ గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు సంబంధించి హెచ్‌ఆర్ స్క్వేర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చామన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ సమస్యలు, ఇతర అంశాలను సత్వరమే పరిష్కరించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు 40 టన్నుల తడిచెత్తను ప్రాసెసింగ్ చేసి దాని ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు ఈ ప్లాంట్ ఏర్పాటవుతుందన్నారు. ఈ సందర్భంగా బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రగతిపై అక్కడి అధికారులు, కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులతో కమిషనర్ చర్చించారు. ఆయన వెంట డీఈ రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



సంఘటనాస్థలంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గండేపల్లి: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ప్రయాణికులు త్రుటిలో బయటపడగా ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు విశాఖ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు గండేపల్లి వచ్చేసరికి సింగరంపాలెం మార్గం నుంచి బైక్‌పై వస్తున్న పి.భద్రరావు పంచాయతీ రోడ్డులోకి వెళ్లేందుకు హైవేని దాటుతుండగా అతనిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని స్వల్పంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భద్రరావు తలకు గాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో గాయపడిని క్షతగాత్రుడిని గండేపల్లి ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ తన కారులో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సమయంలో విద్యుత్ పోల్స్‌కు ఉన్న తీగలు తెగి బస్సుపై పడి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదని గ్రామస్తులతోపాటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పేదలకు సీలింగ్ భూముల పట్టాలు అందజేయాలి

జగ్గంపేట: గుర్రంపాలెం సీలింగ్ భూముల పట్టాలను దళిత, పేదలకు ఇవ్వాలంటూ జిల్లా కలక్టర్ ఇచ్చిన ఆదేశాలను జగ్గంపేట రెవెన్యూ అధికారులు తక్షణం అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జగ్గంపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు.ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ గుర్రంపాలెం సీలింగ్ భూమిని ఎన్నో సంవత్సరాలుగా గ్రామానికి చెందిన దళిత ఇతర వర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబర్ నెలలో తహసీల్దార్ కార్యాలయం వద్ద 16 రోజులు నిరవధిక నిరాహార దీక్షలు చేశామన్నారు. దీంతో జిల్లా కలక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీఓ విచ్చేసి తమతో చర్చించి, పేదలకు పట్టాలు ఇస్తామంటూ హామీలు ఇచ్చి ఆందోళన విరమింపచేశారని తెలిపారు. హామీ ఇచ్చి ఏడు నెలలు అవుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదని విమర్శించారు. దీనిపై డివిజన్, మండల స్థాయి అధికారులను అనేక సార్లు కలిశామని కాని జగ్గంపేట తహసీల్దార్ కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలేదని ఆరోపించారు. తక్షణం అధికారులు స్పందించకపోతే మళ్లీ ఆందోళన ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడిత సతీష్, సంఘం నేతలు దేశెట్టి సురేష్, చిన్న చేదులూరి లక్ష్మి, వడ్లమూరి ఏసమ్మ, చల్లా రత్నం తదితరులు పాల్గొన్నారు.